వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద చేపట్టిన దీక్షలో ప్లకార్డుతో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

బాన్సువాడలో నిర్వహించిన రైతు దీక్షలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

హామీలు అమలు చేశాకే
ఓట్లు అడగాలి

మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలుచేసేవరకు ప్రభుత్వం వెంట పడుతామని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వరికి క్వింటాలుకు అదనంగా రూ. 500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేలు పరిహారం అందజేయాలన్నారు. వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద బాల్కొండ, వేల్పూర్, మెండోరా, ముప్కాల్ మండలాల రైతులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించిన రైతుదీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గే సాక్షిగా ప్రస్తుత డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఎంఎస్‌పీ కన్నా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు గడిచినా ఇచ్చిన హామీలను అమలుచేయడంలేదని మండిపడ్డారు. ఎంపీ ఎన్నికలు ఉన్నప్పుడే ఇచ్చిన హామీలు సరిగ్గా అమలు చేయని కాంగ్రెస్ పార్టీ.. మళ్లీ వారికి ఓటు వేస్తే హామీలను అమలు చేస్తారా అనే విషయంపై రైతులు, ప్రజలు ఆలోచించాలని సూచించారు. కేసీఆర్ ప్రేమించే రైతులు కష్టాల్లో ఉన్నారని తెలిసి మండుటెండలో సైతం పంటలు ఎండిన ప్రాంతాలకు వెళ్లి వారిని కలుస్తూ భరోసా ఇస్తుంటే.. రేవంత్‌రెడ్డి మాత్రం ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తున్నాడని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో బాల్కొండ నియోజకవర్గంలో రైతాంగానికి తాను ఎప్పుడు ఇబ్బందులు కలుగకుండా చూసుకున్నట్లు తెలిపారు. సాగునీరు, విద్యుత్, పంట కొనుగోలు, రైతుబంధు ఇలా ప్రతి విషయంలో రైతులు రోడ్డెక్కే పరిస్థితి లేకుండా సేవలు అందించినట్లు గుర్తుచేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని, అప్పుడే ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని అన్నారు.

అర్వింద్..పసుపు బోర్డు ఆఫీస్ ఎక్కడ?

ఐదు రోజుల్లో పసుపు బోర్డు తీసుకొస్తానని ప్రజలను మోసం చేసిన ఎంపీ అర్వింద్ ఇప్పటి వరకు పసుపు బోర్డు తేలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆయనకు రైతులు ఎందుకు ఓట్లు వేయాలని వేముల ప్రశ్నించారు. మళ్లీ ఇప్పుడు పసుపు బోర్డు సాధించామని చెబుతున్నాడని మండిపడ్డారు. పసుపు బోర్డు సాధిస్తే ఆఫీస్ మెయిన్ దర్వాజ, ఆఫీస్, ఆఫీస్ టాయిలెట్స్ ఎక్కడ ఉన్నాయో చెప్పాలన్నారు. ఇంకా ప్రజలను అబద్ధపు మాటలతో మోసం చేయలేవన్నారు. తనను నమ్మి గెలిపించిన ప్రజల కోసం ఎప్పుడూ ముందుంటానని అన్నారు. భయపడి వెనక్కి పోయేది లేదని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరం వచ్చినప్పుడు వారి వైపు నిలబడకుండా కేవలం మూడు నెలలకే అధికార పార్టీలోకి వెళ్లిన నీచులపై ప్రజాక్షేత్రంలో నిలదీయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు ప్రజల తరపున పోరాడుతూ ఉంటానని అన్నారు. తనపై ఎన్ని కేసులు అక్రమంగా పెట్టాలని చూసినా వెనక్కి వెళ్లేదిలేదన్నారు.

బాన్సువాడ దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

రైతు కోసం పోరుబాట

ఉమ్మడి జిల్లాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దీక్షలు

బాన్సువాడలో పోచారం, వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పాల్గొన్న వేముల నియోజకవర్గ కేంద్రాల్లో మాజీ ఎమ్మెల్యేలు.. తరలివచ్చిన పార్టీ శ్రేణులు, రైతులు వరి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్

కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం రైతుదీక్షలు చేపట్టారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ఈ దీక్షలకు పార్టీ శ్రేణులు, రైతులు పెద్దసంఖ్యలో తరలిచ్చారు. బాన్సువాడలో చేపట్టిన దీక్షలో మాజీ స్పీకర్ పోచారం, వేల్పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించిన దీక్షలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. కామారెడ్డిలో గంప గోవర్ధన్, ఎల్లారెడ్డిలో జాజాల, పిట్లంలో హన్మంత్ షిండే, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బాజిరెడ్డి గోవర్ధన్ ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని వారు డిమాండ్ చేశారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని, రైతుబంధు ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికే రైతు దీక్షలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

నిందలు మానుకొని..
హామీలను అమలు చేయండి

మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 6: కాంగ్రెస్ నాయకులు గత ప్రభుత్వంపై నిందలు మానుకొని, ఎన్నికల్లో వారిచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బాన్సువాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన రైతు నిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. అధికారంలోకి వచ్చి 120 రోజులు గడిచాయని, ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి తప్ప మిగతావి నెరవేర్చలేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందన్నారు. నమ్మి ఓటేసి అధికారమిస్తే.. హామీలను తుంగలో తొక్కి ప్రజలకు మొండి చేయి చూపించారని విమర్శించారు. కౌలు రైతులకు రూ.15వేలు, రూ.2లక్షల రుణ మాఫీ ఇప్పటి వరకూ చేయలేదన్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలయ్యే వరకు పోరాడతామని హెచ్చరించారు.

డబ్బులిచ్చి పదవులు పొందే రకం కాదు..

సొంత నియోజకవర్గంలో ప్రజలు ఓడించి తరిమేస్తే ఇక్కడికి వచ్చిన వలసపక్షి.. తాను చేసిన అభివృద్ధిని ఎత్తిచూపడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోనే అత్యధికంగా 11వేల డబుల్ బెడ్రూం ఇండ్లను మంజూరు చేసి 80శాతం ఇండ్లు పూర్తిచేశామన్నారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తొలివిడుతగా ఇచ్చిన 1600 డబుల్ బెడ్రూం ఇండ్లను కూడా పూర్తిచేయలేని చేతకాని నాయకుడివని విమర్శించారు. ఏ గ్రామంలో డబుల్ బెడ్రూం ఇండ్లు లేవో చూపించాలని సవాల్ విసిరారు. తన కుమారుడు డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి పదవి పోవడానికి ఆ కాంగ్రెస్ నాయకుడే ప్రధాన పాత్ర పోషించాడని ఆరోపించారు. డీసీసీబీ డైరెక్టర్లకు డబ్బుల ఆశ చూపి, గోవా ట్రిప్పులకు పంపించి ద్రోహమైన క్యాంపు రాజకీయాలు చేశాడన్నారు. నీ కన్నా ఎక్కువ డబ్బులిస్తే తన కుమారుడు రాజీనామా చేసేవాడు కాదని, తాము డబ్బులిచ్చి పదవులు పొందే రకం కాదన్నారు. పదవులపై ఆశ లేదని, ప్రజల పక్షాన నిలబడి సేవ చేయడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఆస్తులు, వ్యాపారాలను కాపాడుకునేందుకు అవకాశవాదులు పార్టీ మారినంత మాత్రాన నష్టమేమీ లేదన్నారు. కొందరిని తన కొడుకుల కన్నా ఎక్కువ నమ్మి చేరదీశానని, అండగా ఉండాల్సిన వారు మోసం చేశారని, అలాంటి వారికి పుట్టగతులుండవని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, ఆలిండియా బంజారా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బద్యానాయక్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

పిడికిలి బిగించి కొట్లాడుదాం



నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చేపట్టిన రైతు దీక్షలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేసే వరకు పిడికిలి బిగించి కొట్లాడుదామని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతుదీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకిచ్చిన హామీల అమలును కాంగ్రెస్ ప్రభుత్వం మరిచిపోయిందని మండిపడ్డారు. రూ.2లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, ఎకరానికి రూ.15 వేల రైతుబంధు ఇస్తామని హామీనిచ్చి అధికారంలోకి వచ్చి 117 రోజులు గడిచినా వాటి ఊసెత్తడం లేదన్నారు. అబద్ధపు హామీలిచ్చి రైతులను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం, నిర్వహణ లోపం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్, జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు సిర్ప రాజు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన
హామీలను నెరవేర్చాలి



పిట్లంలో మాట్లాడుతున్న జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

పిట్లం, ఏప్రిల్ 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే అన్నారు. పిట్లంలో నిర్వహించిన రైతునిరసన దీక్షలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులు పండించిన వరికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వాలని, పంట ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని, రూ.2లక్షల రుణమాఫీ తక్షణమే చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఇబ్బందులు మొదలయ్యాయని, ఈ విషయాన్ని ప్రజలు, రైతులు గమనించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అన్నారం వెంకట్‌రాంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయ్, బాబుసింగ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు గాలికి..

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 6: అబద్ధాలు, మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసిందని మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ విమర్శించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని తెలంగాణతల్లి ప్రాంగణంలో నిర్వహించిన రైతుకు మద్దతు దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు వడ్లు అమ్ముకోవద్దని, డిసెంబర్ 9వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, క్వింటాలుకు 500 రూపాయలు బోనస్‌గా ఇస్తామని, అప్పుడు ధాన్యం అమ్ముకోవాలని చిలకపలుకులు చెప్పిన రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాల కోరు అని విమర్శించారు. రేవంత్‌రెడ్డి నాలుగు నెలల్లోనే రాష్ట్రంపై రూ.16వేల కోట్ల అప్పు చేశాడన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

ఎల్లారెడ్డిలో చేపట్టిన దీక్షలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

కామారెడ్డిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

రైతుల్ని మోసం చేసిన కాంగ్రెస్

మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్

కామారెడ్డి, ఏప్రిల్ 6: అసెంబ్లీ ఎన్నికల సమయంలో రైతులకు హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. యాసంగిలో రైతులు పండించిన పంటకు మద్దతు ధరపై అదనంగా రూ.500 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని ఇప్పటికీ చేయలేదన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, కామారెడ్డి ఎంపీపీ పిప్పిరి ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోగులకు నాణ్యమైన
సేవలందించాలి

వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

బాన్సువాడ దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న వైద్యవిధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్

బాన్సువాడ/ బోధన్, ఏప్రిల్ 6: రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. బాన్సువాడ డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన, వందపడకల మాతా శిశు దవాఖానతోపాటు బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ దవాఖానను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దవాఖానలోని ఆయా వార్డుల్లో తిరుగుతూ రోగులకు అందుతున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో ఇన్‌ఫెక్షన్ కంట్రోల్‌కు పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. రోగులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. బాన్సువాడలో శిథిలావస్థకు చేరుకున్న దవాఖాన భవనాన్ని కూల్చివేసి నూతన భవనం నిర్మించాలని సూచించారు. అప్పటి వరకు అందుబాటులో ఉన్న తాత్కాలిక భవనాన్ని సిద్ధం చేసుకోవాలని సూచించారు. బోధన్‌లో విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలనే ధ్యేయంతో తనిఖీ చేసి సౌకర్యాలు, అసౌకర్యాలు గుర్తించి ప్రభుత్వానికి నివేదించనున్నామని తెలిపారు.

ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తాం

అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

తండావాసులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మాచారెడ్డి, ఏప్రిల్ 6: దుర్గమ్మగుడి తండా వాసుల తాగునీటి ఇబ్బందులపై 'దాహం.. దాహం..' అనే శీర్షికన నమస్తే తెలంగాణ దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మాచారెడ్డి మండలంలోని మైసమ్మ చెరువు తండా పరిధిలో ఉన్న దుర్గమ్మ గుడితండాను అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి శనివారం సందర్శించారు. తండావాసుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి ఇబ్బందులు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. తండాలోని ఇంటింటికీ తాగునీరు అందేలా చూస్తామని తెలిపారు. ఆయన వెంట కామారెడ్డి డీఎల్పీవో శ్రీనివాస్, ఎంపీడీవో గోపీబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీ, ఏపీవో సాయిబాబా ఉన్నారు.

అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఆగ్రహం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

వినాయక నగర్, ఏప్రిల్ 6: అబద్ధపు మాటలతో కాంగ్రెస్ పార్టీ గద్దె నెక్కిందని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి విమర్శించారు. రాజకీయాల్లో నైతిక విలువలు లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రైతులకు కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందన్నారు. డిసెంబర్ 9 తరువాత జనవరిలో ఎవరూ బ్యాంకు రుణాలు కట్టవద్దని రేవంత్‌రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కానీ బ్యాంకు అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నా తనకు ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కొడంగల్‌కు మాత్రమే ముఖ్యమంత్రిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఓడిపోయిన చోట మంత్రులను నియమించకుండా, ఓడిన వారితోనే అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి ఊసేలేదన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు గంగారెడ్డి, యెండల పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ, ఏప్రిల్ 6: లోక్‌సభ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని, అభివృద్ధి చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ కోరారు. శనివారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులు, ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఎంపీ అర్వింద్ గెలిచిన ఐదేండ్లలో ఒక్క రోజు కూడా ఈ ప్రాంతానికి రాలేదని, అభివృద్ధికి నయా పైసా కూడా ఇవ్వలేదన్నారు. మోదీని చూసి ఓట్లు అడుక్కోవడం కాకుండా ఆయన ఏం చేశారో చెప్పాలన్నారు. ప్రస్తుత రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి తాను మంజూరు చేసిన అభివృద్ధి పనులకు మళ్లీ శంకుస్థాపనలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమాయకులపై కేసులు పెడుతుందని, బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడొద్దని, అండగా తాను ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు.

గాండ్ల సంఘం నాయకులతో మాట్లాడుతున్న బాజిరెడ్డి గోవర్ధన్

బాజిరెడ్డికి గాండ్ల సంఘం మద్దతు

సారంగాపూర్, ఏప్రిల్ 6 : బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు గాండ్ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు. జిల్లాకేంద్రంలోని ఆయన నివాసంలో నగర గాండ్ల సంఘం నాయకులు శనివారం కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఎంపీ ఎన్నికల్లో తమ కులస్తుల మద్దతు ఉంటుందని తెలిపారు.